
సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం • 19 • సెప్టెంబర్ • 2025



32,336 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఎగువ ప్రాంతాల నుంచి సోమశిలకు 32,336 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. క్రస్ట్ గేట్ల ద్వారా 12,650 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,13,770
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,229
3 శాతం జీఎస్టీతో	రూ.10,536
నవర (8 గ్రా)	రూ.84,288

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.3 /25.9

జిల్లాలో అక్కడక్కడా వర్షం శుక్రవారం కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 39 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

వాహనమిత్రకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు రూరల్: వాహనమిత్ర పథకం కోసం ఆటో, మ్యాక్సీ క్యాబ్ యజమానులు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో శుక్రవారంలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్సీ, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సురెన్స్, ఫిట్‌నెస్ తదితర సర్టిఫికెట్లను జతపర్చాలని సూచించారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్, ఎన్పీసీఐను లింక్ చేసుకోవాలని పేర్కొన్నారు. 2023 వరకు దరఖాస్తు చేసిన వారు మరోసారి చేయాల్సిన అవసరం లేదని వివరించారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా స్థాయి అండర్ - 19 అథ్లెట్ల ఎంపికలు రేపు

నెల్లూరు (టౌన్): ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి అండర్ – 19 బాలబాలికల అథ్లెటిక్స్ క్రీడాకారులను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం ఎంపిక చేయనున్నామని డీవీఈఓ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల విద్యార్థులను పంపాలని కోరారు. విద్యార్థినులకు సహాయకులుగా మహిళా వ్యాయామ అధ్యాపకులు లేదా మహిళా సిబ్బందిని పంపాలన్నారు.

12 బార్లకు లాటరీ డ్రా



నెల్లూరు(క్రైమ్): జిల్లాలో తొలి విడతలో మిగిలిన 33 బార్లకు రీనోటిఫికేషన్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు జారీ చేయగా, 12కు మాత్రమే దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ క్రమంలో బార్ లైసెన్స్‌ల కేటాయింపు ప్రక్రియను కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం నిర్వహించారు. ఓపెన్ కేటగిరీలో నెల్లూరు కార్పొరేషన్లో ఏడు.. కావలి మున్సిపాలిటీలో మూడు.. బుచ్చిరెడ్డిపాళెంలో ఒకటి.. అల్లూరు నగర పంచాయతీలో గీత కులానికి చెందిన ఒక బార్‌కు లాటరీ తీసి వ్యాపారులకు కేటయించారు. మిగిలిన వాటికి నోటిఫికేషన్‌ను మరోసారి జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు, ఏఈఎస్ రమేష్ పాల్గొన్నారు.

ఈసీ x టీఏ

- ఉపాధి హామీ కార్యాలయంలో బూతు పురాణం

దుత్తలూరు: స్థానిక ఉపాధి కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు అసభ్య పదజాలంతో ఒకర్నొకరు దూషించుకున్నారు. చుట్టుపక్కల ప్రభుత్వ కార్యాలయాలున్నాయనే విషయాన్ని విస్మరించి వీరు రెచ్చిపోయారు. అక్కడే ఉన్న ఏపీఓ బ్రహ్మయ్య నచ్చజెప్పేందుకు యత్నించినా, వీరు తగ్గలేదు. ఓ పనికి సంబంధించి ఈసీ హజరత్తయ్య, సాంకేతిక సహాయకుడు సునీల్ మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. పక్కనే ఉన్న వెలుగు కార్యాలయంలోని మహిళలు అవాక్కయ్యారు. కాగా ఈ కార్యాలయంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఉద్యోగులు, సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ విషయమై ఉదయగిరి ఏపీడీ మృదులను సంప్రదించగా, విచారణ జరిపి చర్యలు చేపడతామని బదులిచ్చారు.

నాలుగో రోజూ పెన్‌డౌన్

నెల్లూరు సిటీ: నగరంలోని డాక్యుమెంట్ రైటర్లు నాలుగో రోజు గురువారం పెన్‌డౌన్ చేపట్టి నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలను ధరించి కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు శుక్ర, శనివారాల్లో పెన్‌డౌన్‌ను నిర్వహించనున్నారని దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు తెలిపారు.

మానవత్వమేదీ..?



రోడ్డుపై బైఠాయించిన మృతుల కుటుంబీకులు

కూటమి ప్రభుత్వం నిర్దయతో వ్యవహరిస్తోంది. తమ పార్టీ నేతలు ప్రకృతి వనరులను కొల్లగొడుతూ.. భారీగా ఆర్జిస్తున్నా.. వారిని నియంత్రించకపోగా.. పరోక్ష సహకారం అందిస్తోంది. తాజాగా ఇసుక మాఫియా ధనదాహానికి ఐదు కుటుంబాలకు చెందిన ఏడుగురు దళితులు మృత్యువాత పడగా, వారిని ఆదుకోవడంలో చేష్టలుడిగి చూస్తోంది. ఇంత ఘోరం జరిగినా, కనీసం వారిని పరామర్శించేందుకు ప్రజాప్రతినిధులు, మంత్రులు రాలేదంటే వారి తీరు ఏమిటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలియజేసేందుకే వారు పరిమితమవడం విస్మయానికి గురిచేస్తోంది. న్యాయం కోసం మృతదేహాలతో కుటుంబీకులు రోడ్డెక్కితే అరకొర సాయం చేస్తూ ప్రకటనను సర్కార్ విడుదల చేసింది. వీరి తీరుపై దళిత సంఘాలు భగ్గుమంటున్నాయి.

ఇసుక మాఫియా ధనదాహానికి దళిత కుటుంబాలు బలి

- ఇంత ఘోరం జరిగినా పరామర్శించని ఎమ్మెల్యేలు, మంత్రులు
- సోషల్ మీడియాలో విచారం వ్యక్తం చేసేందుకే పరిమితం
- న్యాయం కోసం మృతదేహాలతో రోడ్డెక్కితే అరకొర సాయం ప్రకటన
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపాటు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వంలో మానవత్వానికి చోటు కరువైంది. తమ్ముళ్ల ధనదాహంతో సంగం మండలం పెరమన వద్ద టిప్పర్ ఢీకొని ఏడుగురు దళితులు మృత్యువాత పడి ఆ కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపారు. వీరందరూ పేదలే. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలు.. ఇలా శోకసంద్రంలో మునిగితేలి కన్నీటిధారలు కారుస్తుంటే వారిని పరామర్శించేందుకు సైతం ప్రజాప్రతినిధులకు సమయం దొరకలేదు. మేమెందుకు పరామర్శించాలనే నిర్లక్ష్య ధోరణి వారిలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. న్యాయం కోసం మృతదేహాలతో రోడ్డెక్కాకే ప్రభుత్వంలో కదలికొచ్చింది. ఆపై నామమాత్రంగా రూ.ఐదు లక్షల చొప్పున విదిల్చింది.

ప్రాణం విలువ ఇంతేనా..?

తమ ఇంటి పెద్దలను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న కుటుంబాలకు భారీగా సాయం చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా రూ.ఐదు లక్షలను విదిల్చింది. అదే గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఉదంతాలు చోటుచేసుకున్నప్పుడు ఎంతో ఉదారంగా సాయం చేసి సదరు కుటుంబాలకు ఆపన్న హస్తాన్ని నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. ఉదాహరణకు విశాఖపట్నంలోని ఓ పరిశ్రమలో ప్రమాదం సంభవిస్తే, కుటుంబానికి రూ.కోటి చొప్పున అందించారు. మరోవైపు రోడ్డు ప్రమాదం సంభవించి 24 గంటలు గడిచినా ఆర్థిక సాయం చేసే దిశగా ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపలేదు. చివరికి న్యాయం కోసం మృతదేహాలతో కుటుంబసభ్యులు రోడ్డెక్కితే గంటల వ్యవధిలో రూ.ఐదు లక్షల సాయాన్ని అందించి చేతులు దులుపుకొన్నారు.

అందరూ కాయకష్టం చేసేవారే..

మృతులందరూ కాయకష్టం చేసి బతికేవారే. ముత్తుకూరు గేట్ సమీపంలోని గుర్రాలమడుగు సంఘానికి చెందిన శేషం శారదమ్మ, శేషం బాలవెంగయ్య బేల్దారి కూలీలుగా.. నెల్లూరు రూరల్ బాబానగర్‌లోని వడ్డిపాళేనికి చెందిన తాళ్లూరు శ్రీనివాసులు, రాధమ్మ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకూరుపేట మండలానికి చెందిన చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మి ఆటో నడుపుతూ.. డ్రైవర్‌గా బ్రహ్మయ్య నెలవారీ జీతంతో బతుకునీడుస్తున్నారు. టీడీపీ నేతల ధనదాహం పగబట్టి ఆయా కుటుంబాలను టిప్పర్ రూపంలో చిదిమేసింది. ఈ హృదయవిదారక ఘటన యావత్ రాష్ట్ర ప్రజలను కలిచివేసినా.. అధికార ప్రజాప్రతినిధుల హృదయాలను మాత్రం తాకలేదు. పోస్ట్‌మార్టాన్ని నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులను అర్ధరాత్రి తర్వాత అప్పగించారు. మనుషుల ప్రాణాల కంటే అసెంబ్లీ సమావేశాలు పెద్ద ముఖ్యమేమీ కాదనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.



మమ్మల్నెందుకు వదిలేశారు..?

ఇందుకూరుపేట / కోవూరు: అమ్మా.. నాన్నా.. ఎక్కడికెళ్లారు.. మమ్మల్నెందుకు వదిలేశారు.. అంటూ చిన్నారుల వేదన చూపరులను కలిచివేసింది. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారుల భవిష్యత్తు ఎలా అనే ఆలోచన గ్రామస్తులను దహించేస్తోంది. సంగం మండలంలోని పెరమన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు మృతి చెందగా, వారి భౌతికకాయాలు స్వగ్రామానికి బుధవారం అర్ధరాత్రి చేరుకున్నాయి. ఉదయం వరకు అందరితో మాట్లాడిన వారు ఇప్పుడు విగతజీవులుగా మారిపోవడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. తల్లిదండ్రులను కోల్పోయి చందుప్రియ (పదో తరగతి), విశ్వంత్ (ఆరో తరగతి) అనాథలయ్యారు.



తండ్రి మృతదేహం వద్ద చిన్నారులు



విలపిస్తున్న గ్రామస్తులు

కంటికి రెప్పలా కాపాడుకుంటూ..

చిన్నతనం నుంచే చందుప్రియ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. దీంతో తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకుంటూ, వైద్యుల సూచనల మేరకు తరచూ పరీక్షలు చేయించేవారు. పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో కష్టాలు పడుతూ.. చదువులు నేర్పాలని కలలుగన్న తల్లిదండ్రులు ఒక్కసారిగా దూరం కావడంతో వీరి పరిస్థితి దయనీయంగా మారింది. వీరికి ప్రభుత్వం అండగా నిలిచి.. చదువు, వైద్యానికి సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదుకోకపోతే నిరసన

ఇసుక అక్రమ రవాణానే ఈ ప్రమాదానికి కారణమని సీపీఎం నేతలు ఆరోపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆర్థిక సాయమందించాలని, లేని పక్షంలో నిరసనలను చేపడతామని స్పష్టం చేశారు.

నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- మృతుల కుటుంబాలకు పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో పగలూ, రాత్రనే తేడా లేకుండా ఇసుకను అక్రమంగా భారీ వాహనాల్లో తరలిస్తూ ఎంతో మంది ప్రాణాలను బలిగొంటున్నా, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సంగం మండలం పెరమన వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి భౌతికకాయాలకు నగరంలోని 16వ డివిజన్లో గల గుర్రాలమడుగు సంఘంలో గురువారం నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి.. అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం బాధాకరమని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆరోపించారు. అవినీతి సంపాదన కోసం ఎన్ని కుటుంబాలను బలి తీసుకుంటారని ప్రశ్నించారు. జిల్లాలో జరుగుతున్న ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాతో ఇలాంటి ప్రమాదాలు కోకొల్లలుగా జరుగుతున్నాయని మండిపడ్డారు. ఉచిత ఇసుక పేరుతో అనధికారికంగా తరలిస్తూ ప్రభుత్వాదాయానికి అధికార పార్టీ నేతలు గండికొడుతున్నారని ధ్వజమెత్తారు. సోమశిల నుంచి నీటిని ఇటీవల విడుదల చేస్తే, విరువూరు రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు నీటిలో చిక్కుకుపోయిన పరిస్థితులు అందరికీ తెలుసునన్నారు. ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ.. అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న వారిపై ఎస్పీ కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. టిప్పర్ డ్రైవర్‌పైనే కాకుండా ప్రమాదానికి కారణంగా భావించే అధికలోడు ఇసుకను తరలిస్తున్న వ్యక్తులు, వాహన యజమానిపై కేసు నమోదు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి తక్షణ సాయంగా రూ.25 లక్షలను అందించడంతో పాటు మరో రూ.25 లక్షలను ప్రమాదానికి కారణమైన వారి నుంచి బాధిత కుటుంబాలకు అందించి ఆదుకోవాలని పేర్కొన్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కాంక్షించారు.

గుర్రాలమడుగులో విషాదఛాయలు

నెల్లూరు సిటీ: నగరంలోని గుర్రాలమడుగు సంఘంలో నివాసం ఉంటున్న శారమ్మ, బాలవెంగయ్య కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. రోడ్డు ప్రమాదంలో తమ వారిని కోల్పోవడంతో వీరి రోదనలు మిన్నంటాయి. వీరిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుతో ఆ పార్టీల నేతలు రెచ్చిపోయి ప్రమాదానికి కారణమయ్యారని స్థానికులు ఆరోపించారు.



రోదిస్తున్న కుటుంబసభ్యులు

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ఆత్మకూరు: కూటమి నేతల ధనదాహానికి బలైన వారి కుటుంబసభ్యులకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ఇసుక కాంట్రాక్టర్ల ద్వారా చెల్లించేలా చూడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో గురువారం వారు మాట్లాడారు. ఎలాంటి అనుమతుల్లేకుండా రీచ్‌ల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి, విక్రయిస్తున్నారని ఆరోపించారు. మృతుల కుటుంబాల్లో అర్హత ఉన్న వారికి ప్రభుత్వోద్యోగమివ్వాలని డిమాండ్ చేశారు. అక్రమ దందా జరుగుతున్నా, సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శించారు. మర్రిపాడు సమీపంలోని అతి పెద్ద డంపింగ్ యార్డులో గతేడాదిలో ఇసుక రోజుల వ్యవధిలో మాయమైందని గుర్తుచేశారు. ఇసుక తరలింపు, తవ్వకాలకు ప్రస్తుతం అనుమతుల్లేకపోయినా, దర్జాగా సాగిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, పార్టీ న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు నందా ఓబులేసు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, శాప్ మాజీ డైరెక్టర్ కాలువ నరసింహులు, పార్టీ మండల కన్వీనర్లు బిజివేముల పిచ్చిరెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి రమేష్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

నెల్లూరు(అర్బన్): హెచ్‌ఐవీ / ఎయిడ్స్ రహిత జిల్లాగా నెల్లూరును మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత కోరారు. హెచ్‌ఐవీ, సుఖవ్యాధులు, మాదకద్రవ్యాల నివారణపై ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించే ప్రచార రథం నగరానికి గురువారం సాయంత్రం చేరుకుంది. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. హెచ్‌ఐవీ తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించనున్నామని వివరించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే హెచ్‌ఐవీ తీవ్రత ఇక్కడ తక్కువగా ఉందని, అయితే కొత్త కేసులు రాకుండా యువతను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్యులు సైతం అవగాహన పెంచుకునేలా కళారూపాలను ప్రదర్శించనున్నారని వెల్లడించారు. జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ సుజాత

నియామక పత్రాల అందజేత వాయిదా

నెల్లూరు (టౌన్): డీఎస్సీ – 2025కు సంబంధించి ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అమరావతిలో శుక్రవారం అందజేయాలని భావించినా, భారీ వర్షాలతో వాయిదా వేశారని డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల రాకపోకలు, వసతి తదితరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నారని, తదుపరి ఎప్పుడు నిర్వహించేది తెలియజేయనున్నారని చెప్పారు.

బోగోలు సర్పంచ్‌కు షోకాజ్ నోటీస్

- పంచాయతీ కార్యదర్శిపై క్రమశిక్షణ చర్యలు

నెల్లూరు(పొగతోట): పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై బోగోలు సర్పంచ్ అనితకు షోకాజ్ నోటీస్‌ను డీపీఓ శ్రీధర్‌రెడ్డి గురువారం జారీ చేశారు. బోగోలు గ్రామ పంచాయతీలో రూ.30 లక్షల నిధుల దుర్వినియోగం.. రూ.33,49,035ను అనవసరంగా ఖర్చు చేశారు. ఈ విషయమై ఫిర్యాదులు రావడంతో కావలి డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శిగా అబ్దుల్ జహీర్ పనిచేసిన సమయంలో నిధులు దుర్వినియోగమయ్యాయనే అంశాన్ని గుర్తించారు. ఈ క్రమంలో సర్పంచ్ చెక్ పవర్‌ను ఎందుకు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ కోరుతూ షోకాజ్ నోటీస్‌ను జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శిపై క్రమశిక్షణ చర్యలకు ఆ శాఖ కమిషనర్‌కు నివేదికలు పంపారు.

భక్తులకు పంచేందుకు 250 కిలోల గంధం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజా రహంతుల్లా దర్గాలో గంధ మహోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులకు 250 కిలోల గంధాన్ని పంచేందుకు సిద్ధం చేశారు. నగారాఖానా సెంటర్ నుంచి దర్గా వరకు విద్యుత్ కాంతులతో లైట్లను ఏర్పాటు చేశారు. దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా దాదాపు 34 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన పర్యవేక్షిస్తున్నామని ఈఓ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. గంధ మహోత్సవాన్ని ఫయాజ్ అహమ్మద్ ఇంటి నుంచి దర్గాకు ఎత్తుకెళ్లేలా వక్ఫ్‌బోర్డు నిర్ణయించిందని, ఆ మేరకు ఆదేశాలను జారీ చేశామని తెలిపారు. దీపారాధనను హాఫీజ్‌పాషా నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

గంధాన్ని దంచేందుకు పోటీపడిన మహిళలు

గంధ మహోత్సవం సందర్భంగా మహల్ వద్ద గంధాన్ని దంచేందుకు మహిళలు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. వీరిని పోలీసులు అదుపుచేస్తూ ఒక్కొక్కరిగా అనుమతించారు. ఇతర రాష్ట్రాల మహిళా భక్తులు భారీగా విచ్చేశారు.



గంధాన్ని దంచుతున్న తహసీల్దార్, దర్గా ఈఓ

వైద్య విద్య ప్రైవేటీకరణ దారుణం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మంజూరైన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించే దిశగా ప్రస్తుత సీఎం చంద్రబాబు అడుగులేయడం దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేయించి, 12 పూర్తి చేయగా, మరో ఐదు నిర్మాణం పూర్తయ్యే దశలో తన స్వార్థ ప్రయోజనాల కోసం వీటిని ప్రైవేటీకరించేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆయన సీఎంగా వ్యవహరించిన సమయంలో రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాలను తీసుకొచ్చిన దాఖలాల్లేవని విమర్శించారు. జగనన్న కృషితో రాష్ట్రంలో 2500 మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. పేద విద్యార్థుల కలను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా.. స్థల సేకరణ, అనుమతులతో పాటు 12 మెడికల్ కళాశాలలను పూర్తి స్థాయిలో నిర్మించారని వివరించారు. మిగిలిన మెడికల్ కళాశాలలను పూర్తి చేసేందుకు నిధుల్లేవని చంద్రబాబు పేర్కొనడం హాస్యాస్పదమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం లక్షల కోట్ల అప్పులు తెస్తూ.. సంక్షేమ పథకాలను అరకొరగా అమలు చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాపైందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు రాకూడదనే ఉద్దేశంతో చంద్రబాబు ఇలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నా, ఆయన మాత్రం పట్టించుకోవడంలేదన్నారు.



మాట్లాడుతున్న కాకాణి పూజిత

చలో మెడికల్ కాలేజీ నేడు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని పార్టీ యువజన, విద్యార్థి విభాగ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీల వద్దకు యువకులు, విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

వివిధ అంశాలపై ఎస్పీ ఆరా

నెల్లూరు(క్రైమ్): ఆయుధాలు.. మందుగుండు సామగ్రి ఎంత ఉంది.. సీసీ కెమెరాలు ఎన్ని పనిచేస్తున్నాయి.. డయల్ 112కు ఎన్ని ఫోన్‌కాల్స్ వస్తున్నాయి.. ఇలా అనేక అంశాలను ఎస్పీ అజిత వేజెండ్ల ఆరాతీశారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆయుధాల గది, ఇంట్రిగేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏఎస్పీ సౌజన్యతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. మందుగుండు సామగ్రి, స్టోర్ రూమ్‌లో గల అత్యవసర సామగ్రికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొని వాటిని పరిశీలించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని వీడియో వాల్, సీసీ కెమెరాల పనితీరు, ఎల్‌హెచ్ఎమ్మెస్, డయల్ 112 వ్యవస్థ పనితీరును పరిశీలించారు. డయల్ 112, శక్తియాప్‌నకు కాల్స్ వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారమందించాలని కోరారు. పనిచేయని సీసీ కెమెరాలకు వెంటనే బాగుచేయించాలని సూచించారు. బీట్ వ్యవస్థ, హైవే మొబైల్, వీహెచ్‌ఎఫ్ సెట్ మానిటరింగ్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా ఛేదించిన కేసులను తెలుసుకున్నారు. ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ భక్తవత్సలరెడ్డి, ఆర్‌ఐలు రాజారావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆయుధాల గదిని పరిశీలిస్తున్న ఎస్పీ

క్లుప్తంగా

బంగారు దుకాణాలే లక్ష్యం

- నగలు బేరమాడినట్టు నటిస్తూ చోరీ చేసే మహిళల అరెస్ట్
- 22 గ్రాముల స్వాధీనం

పొదలకూరు: బంగారు దుకాణాలకు వెళ్లి నగలు బేరమాడినట్లు నటిస్తూ చోరీలకు పాల్పడే మహిళలను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు, స్థానిక దుకాణ యజమానుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా వీర్లపాడు మండలం గోకరాజుపాళెం గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు పొదలకూరులో బంగారు నగల దుకాణాలనే లక్ష్యంగా చేసుకున్నారు. కొనే సాకుతో షాపు నిర్వాహకులను మాటల్లో పెట్టి కమ్మలను తస్కరిస్తారు. నెలరోజుల క్రితం పట్టణంలోని ఓ దుకాణానికి వెళ్లి ఐదు జతల బంగారు కమ్మలను అపహరించారు. పదిరోజుల క్రితం మరో షాపునకు వెళ్లి రెండు జతల కమ్మలను చోరీ చేశారు. ఎవరూ పసిగట్టలేరని మంగళ, బుధవారాల్లో పొదలకూరులో తిరుగుతుండగా గుర్తించిన యువకులు పోలీసులకు సమాచారమిచ్చారు. ముగ్గురిలో ఒకరు పరారు కాగా బుజ్జిగాని జ్ఞానమ్మ, బుజ్జిగాని ఆదెమ్మలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు పొదలకూరులోని బంగారు దుకాణాల నుంచి మొత్తం రూ.2 లక్షల విలువైన కమ్మలను తస్కరించారు. వారి నుంచి 22 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు.

విజయ డెయిరీ డైరెక్టర్ల స్థానాలకు 27న ఎన్నికలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్ విజయ డెయిరీలో 15 మంది డైరెక్టర్లలో ముగ్గురి పదవీ కాలం ముగుస్తుంది. వాటికి ఈనెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తారని అధికారి హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండ్రెడ్డి రంగారెడ్డి, కన్నా ఇందిరమ్మ, సూదలగుంట సాయిశిరీష అనే డైరెక్టర్ల పదవీకాలం ఈనెల 30వ తేదీతో ముగిస్తుంది. ఈ నేపథ్యంలో ఈనెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తారు. వెంకటేశ్వపురంలోని విజయ డెయిరీ మీటింగ్ హాల్లో 22న నామినేషన్ల స్వీకరణ, అదేరోజు మధ్యాహ్నం పరిశీలన, 23న ఉపసంహరణ ఉంటుంది. 27న ఎన్నికలు నిర్వహించి ఓట్లు లెక్కించి అదేరోజు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి వెల్లడించారు.

ఊటుకూరులో ఇల్లు దగ్ధం

సైదాపురం: మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన కాలగందల రమణమ్మ అనే మహిళ రేకుల ఇల్లు గురువారం దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. ఊటుకూరు గ్రామానికి చెందిన రమణమ్మ గని పనుల నిమిత్తం వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకుని పని చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో వస్తువులు, బంగారం, నగదు కాలిపోయాయి. ఆమె కట్టుబట్టలతో మిగిలింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15



ప్రశ్నించే పత్రికలపై కేసులా?

పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటాయి. ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తున్న సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదు. ప్రశ్నించే గొంతుల్ని అణగదొక్కాలనుకుంటే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుంది.

– కత్తి శ్రీనివాసులు, సీపీఎం నగర కార్యదర్శి



హక్కులను కాలరాస్తోంది

రాష్ట్రంలో పత్రికల హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. ప్రశ్నించే సాక్షి పత్రికపై కక్షసాధింపు చర్యలకు దిగడం దారుణం. జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం సరైన పద్ధతి కాదు. ఇప్పటికైనా వైఫల్యాలను తెలుసుకుని ప్రజలకు మంచి పాలన అందిస్తే బాగుంటుంది.

– జి.నాగేశ్వరరావు, సీఐటీయూ నగర కార్యదర్శి





నెల్లూరులో మధ్యాహ్నం వేళ ఆకాశం మేఘావృతమై..



బాలాజీ నగర్ ఏరియాలో..



సండే మార్కెట్‌లో ఇదీ పరిస్థితి



ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఇలా..



నెల్లూరు మాగుంట లేఅవుట్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద వాహనదారుల కష్టాలు

దంచికొట్టిన వాన.. రోడ్లు జలమయం

గురువారం ఉదయమంతా ఎండ.. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కాసేపు ఉరుములు, మెరుపులతో కూడిన వాన దంచికొట్టింది. వర్షం వల్ల నెల్లూరు నగరంలో చాలావరకు రోడ్లు జలమయం అయ్యాయి. వాన నీరు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆత్మకూరు బస్టాండ్, మాగుంట లేఅవుట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిల కింద నీరు నిలిచింది. అటుగా రాకపోకలు సాగించే వారు పడిన అవస్థలు వర్ణనాతీతం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కేవీఆర్ పెట్రోల్ బంక్ రహదారి వద్ద ఇలా..



పోలీస్ కార్యాలయం వద్ద వెళ్తున్న విద్యార్థినులు

ప్రమాదం.. విషాదం

రహదారులు రక్తసిక్తమయ్యాయి. జిల్లాలోని వివిధ మండలాల్లో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు.

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ట్రాక్టర్‌ను ఢీకొని..



విగతజీవిగా వెంకటేశ్వర్లు

సంగం: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను మోపెడ్ వెనుక నుంచి ఢీకొని వ్యక్తి మృత్యువాతపడిన ఘటన మండలంలోని సిద్ధీపురం వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కొండాపురం మండలం వెలిగాండ్ల గ్రామానికి చెందిన దార్ల వెంకటేశ్వర్లు (50) పౌరోహిత్యం చేస్తుంటాడు. రెండురోజుల క్రితం ఆత్మకూరు మండలం నారంపేట గ్రామంలో జరిగిన కార్యక్రమానికి వచ్చాడు. గురువారం బంధువులను చూసేందుకు నారాయణరెడ్డిపేటకు మోపెడ్‌పై బయలుదేరాడు. సిద్ధీపురం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సంగం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రాజేష్ బాధిత కుటుంబానికి సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేశారు.

మోపెడ్ అదుపుతప్పి..



ఘటనా స్థలంలో వెంకటనరసయ్య మృతదేహం

దుత్తలూరు: మోపెడ్ అదుపుతప్పి ఒకరు మృతిచెందిన ఘటన గురువారం సాయంత్రం వెంకటంపేట మలుపు వద్ద జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మర్రిపాడు మండలం ఇసుకపల్లి గ్రామానికి చెందిన వెంకటనరసయ్య (51) ఉదయగిరిలో పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెంకటంపేట మలుపు వద్దకు వచ్చేసరికి మోపెడ్ అదుపుతప్పింది. దీంతో వెంకటనరసయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో ఎవరూ అతడిని గుర్తించలేదు. చాలాసేపటి తర్వాత అటుగా వెళుతున్న వాహనదారులు గమనించి 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడి..



ఘటనా స్థలంలో ట్యాంకర్

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని ఊటుకూరు పంచాయతీ ఇందిరానగర్ సమీపంలో గురువారం సాయంత్రం ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడి బద్వేల్‌కు చెందిన డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కావలి – దుత్తలూరు మధ్య కొన్నినెలల నుంచి 167 బీజీ రహదారి పనులు జరుగుతున్నాయి. యంత్రాలకు ఆయిల్ సరఫరా చేసే నిమిత్తం డ్రైవర్ నవీన్ (24) కాంట్రాక్టర్ సంస్థకు చెందిన ట్యాంకర్‌తో బద్వేల్ నుంచి వింజమూరు వైపు వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇందిరానగర్ సమీపంలో ఉన్న కల్వర్టును ట్యాంకర్ ఢీకొట్టి రోడ్డు కింద వైపునకు జరిగి బోల్తా పడగా నవీన్ అక్కడికక్కడే చనిపోయాడు. ఘటనా స్థలాన్ని సీఐ వెంకటనారాయణ, ఎస్సై వీరప్రతాప్ పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం

నెల్లూరు(అర్బన్): జిల్లాలో గురువారం మధ్యాహ్నం పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండకాసింది. అనంతరం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వెంకటాచలం మండలం ఇస్కపాళెంలో పిడుగుపాటుకు రెండెడ్లు దెబ్బతిన్నాయి. ఆత్మకూరు, సంగం, బుచ్చి, వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, సంగం తదితర పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి.

పిడుగుపాటుకు రైతు బలి

కోవూరు: మండలంలోని వేగూరు పంచాయతీలో గురువారం పిడుగుపడి ఓ రైతు మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైతు గోళ్ల వెంకయ్య (55) పొలంలో పనులు ముగించుకుని ఇంటికి చేరుకునే క్రమంలో మధ్యాహ్నం వర్షం కురిసింది. పిడుగుపడి అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వెంకయ్య మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



రామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న జూపూడి ప్రభాకర్

- రామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన జూపూడి

కావలి(అల్లూరు): కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన కావలికి విచ్చేశారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు ఎక్కువైనట్లు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఇలాంటి నీచ రాజకీయం చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రశ్నిస్తుందన్నారు. తాము ఎక్కడికెళ్లినా గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఏ ప్రభుత్వమైనా పనిచేయాలన్నారు. రామిరెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కావలి బుడంగుంట ఎస్సీ కాలనీలో విద్యుత్ అధికారులు చేసిన దాడి సరైనది కాదన్నారు. పేద ప్రజలపై దుశ్చర్య సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కుందుర్తి కామయ్య, కుందుర్తి శ్రీను, కృష్ణారెడ్డి, కామరాజు, మాల్యాద్రి, పుల్లయ్య, పద్మ, కల్యాణి, రాఘవులు, కృష్ణమూర్తి, మద్దిబోయిన రఘు, కె.సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.142
లేయర్	: రూ.110
బ్రాయిలర్ చికెన్	: రూ.252
స్కిన్‌లెస్ చికెన్	: రూ.278
లేయర్ చికెన్	: రూ.187

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

లింగసముద్రం: హత్య కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడ్లూరు సీఐ మంగారావు కథనం మేరకు.. మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో నివాసముంటున్న ఆవుల శ్రీనివాసులు ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి తన ఇంటి వరండాలో మంచంపై నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. శ్రీనివాసులు పెద్ద కుమార్తె దాసరి మనీషా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శ్రీనివాసులు భార్య ఐదు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. ఒంటరిగా ఉంటున్న అతను ఇంటి పక్కనున్న ఆవుల శ్రీదేవి అనే మహిళతో ఏడాది నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో వలేటివారిపాళెం మండలం బొంతవారిపాళెం గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి సాదం రాజేంద్రప్రసాద్, శ్రీదేవికి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం శ్రీనివాసులుకు తెలిసింది. అతను వారిని నిలదీశాడు. దీనిని మనసులో పెట్టుకుని శ్రీనివాసులును శ్రీదేవి, రాజేంద్రప్రసాద్‌లు ఇనుప టెంట్ హుక్కుతో అతి కిరాతకంగా కొట్టి చంపారు. నిందితులను లింగసముద్రంలో అరెస్ట్ చేసి కందుకూరు కోర్టులో గురువారం హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్సై నారాయణ, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

పేదల కోసం సహకార సంఘాలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అంతర్జాతీయ సహకార సంవత్సరం – 2025 సందర్భంగా పేద, అల్పాదాయ వర్గాల కోసం సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు డీసీఓ గుర్రప్ప తెలిపారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో గురువారం నెల్లూరు మహోదయ పరస్పర సహాయక సహకార సంఘ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో వివిధ వృత్తులకు చెందిన అల్పాదాయ వర్గాలను కలిసి సహకార సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తే సభ్యులు ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. అనంతరం సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 48.651 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 48.651 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10.100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. ఇక్కడి నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,150, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



అధికారులతో మాట్లాడుతున్న హిమాన్షు శుక్లా

నెల్లూరు రూరల్: 'అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. తద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది' అని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం నెల్లూరు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నా యని చెప్పారు. వాటిని సక్రమంగా అమ లు చేసి అన్ని విభాగాల్లో జిల్లాను ముందంజలో ఉంచేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. పంచాయతీల్లో తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కిచెన్ గార్డెన్స్, ఇంటింటి చెత్త సేకరణ, గ్రీన్ అంబాసిడర్స్, ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రోత్సహించడం తదితరాల గురించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మరు గుదొడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నాగరాజకుమారి, గంగాభవాని, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు కోటేశ్వరరావు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుడికి శిక్ష ఖరారు

ఉలవపాడు: మండల పరిధిలో 2020లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడికి ఒంగోలు ఏడో ఏడీజే కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధించినట్లు కందుకూరు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని ఓ ఎస్టీ మహిళ గేదెల మేత కోసం గట్టు మీద వెళ్తున్న సమయంలో కరేడుకు చెందిన నక్కా రమేష్ నా పొలం దగ్గరకు ఎందుకు తీసుకువస్తున్నావని అడిగాడు. గట్టు మీదే కదా వెళ్తున్నట్లు ఆమె సమాధానం చెప్పింది. అయితే రమేష్ ఆమెను కులం పేరుతో దూషిస్తూ చీరపట్టుకుని లాగి చెంపపై కొట్టి పంట కాలువలో పడవేశాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి రాజా వెంకటాద్రి శిక్ష విధించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 68,213 మంది స్వామివారిని దర్శించుకోగా 29,410 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.2.86 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇక, సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



నెల్లూరు(లీగల్): కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా జడ్జి జి.శ్రీనివాస్‌ను గురువారం కోర్టులోని ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించారు.